సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 23 । సెప్టెంబర్ । 2024



'ఏ'వన్‌గా నిలిచారు

దులీప్ ట్రోఫీ క్రికెట్ పోటీల్లో ఇండియా- ఏ జట్టు విజేతగా నిలిచింది. ఇండియా - సీ జట్టు రెండో స్థానంతో సరిపెట్టుకుంది. 8లో



టమాట కిలో రూ.46

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.46 పలికింది. కనిష్టం రూ.23, సరాసరి రూ.36 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
35.6°/22.8°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. ఉక్కపోత పెరిగింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా ఫిర్యాదు అందజేయవచ్చని తెలిపారు.

జిల్లాకు వర్షసూచన



అనంతపురం అగ్రికల్చర్: రానున్న రెండు రోజులూ ఉమ్మడి జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి ఆదివారం విడుదల చేసిన బులెటిన్‌లో తెలిపారు. భారత వాతావరణ శాఖ, అమరావతి వాతావరణ కేంద్రం విడుదల చేసిన సమాచారం ప్రకారం ఆదివారంతో పాటు సోమ, మంగళవారం కూడా ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడా మోస్తరుగా వర్షం పడవచ్చన్నారు. కొన్ని ప్రాంతాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఉరుములు, మెరుపులతో ఒకట్రెండు చోట్ల భారీ వర్షం పడుతుందన్నారు.

జిల్లాలో 95.6 మి.మీ వర్షం

ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి వరకు 95.6 మి.మీ వర్షం కురిసింది. లేపాక్షిలో 42.2,హిందూపురం 21.2, చిలమత్తూరు 10.8, అగళి 8.6, రొళ్ల 6.4, మడకశిర 3.2, పరిగి 3.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సగటు వర్షపాతం 3.0గా నమోదైందన్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి



ధర్మవరం స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా పాతనేరస్తులు, రౌడీషీటర్లకు పోలీసులు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. మీ ప్రవర్తనపై నిరంతర నిఘా ఉంటుందని, గ్రామాల్లో ఎలాంటి గొడవలకు వెళ్లినా, సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా, కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగి ప్రశాంత జీవితం గడపాలని సూచించారు. అక్రమంగా టపాసులు అమ్మి గతంలో కేసులు నమోదైన వారి ఇళ్లు కూడా సోదాలు చేస్తామన్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా టపాసులు నిల్వ ఉంచుకోకూడదన్నారు. అలాగే ప్రధాన రహదారులపై వాహనాలు తనిఖీలు చేసి రికార్డులు సరిగా లేని వాహనాలకు స్టేషన్‌కు తరలించారు.


ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య సేవలు



'ఆత్మ' సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిన బృందాన్ని అభినందిస్తున్న రత్నాకర్‌రాజు

ప్రశాంతి నిలయం: ప్రశాంతి గ్రామ్ వద్దగల సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్)లో ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ రోగులకు వైద్య సేవలను సులభతరం చేయనున్నట్లు శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్‌రాజు తెలిపారు. సిమ్స్‌లో ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో 'ఆత్మ' పేరుతో రూపొందించిన మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్‌ను ఆదివారం ప్రారంభించారు. సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిన బృందాన్ని రత్నాకర్ రాజు అభినందించి, అనంతరం మాట్లాడారు. ఇకపై రోగులకు ఆస్పత్రిలో రిజిస్ట్రేషన్ నుంచి రోగి డిశ్చార్జ్ అయ్యే వరకు ప్రతి యూనిట్ వద్ద సులభతరంగా నాణ్యమైన వైద్య సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, సిమ్స్ డైరెక్టర్ డాక్టర్ గురుమూర్తి, పలు విభాగాల హెచ్‌ఓడీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణాలతో చెలగాటం



తనకల్లులో వైద్యం వికటించి ఇటీవల ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. వారం క్రితం కొత్తచెరువులోని ఓ ప్రైవేటు క్లినిక్‌లో చిన్నారికి సెలైన్ ఎక్కించిన తర్వాత వికటించింది. ఆ తర్వాత ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మరో ఇంజక్షన్ వేసి పంపించారు. మూడు రోజులపాటు వైద్యం చేసి రూ.3 వేల దాకా వసూలు చేశారు. వైద్యం వికటించడంపై ఆరా తీస్తే.. సదరు డాక్టర్‌కు స్పెషలైజేషన్ ఏమీ లేదని తేలింది. కానీ చిన్న పిల్లలకు వైద్యం చేస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా రోజూ ప్రైవేటు క్లినిక్‌లలో సరైన వైద్యం అందక రోగులు ఇబ్బంది పడుతున్న ఘటనలు వెలుగు చూస్తూనే ఉన్నాయి.

- అర్హత లేకున్నా ప్రైవేట్ క్లినిక్‌ల నిర్వహణ
- పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోన్న వైద్యారోగ్యశాఖ
- గత్యంతరం లేక క్లినిక్‌లను ఆశ్రయిస్తున్న రోగులు
- పలు ఆస్పత్రుల్లో అర్హత లేకున్నా ల్యాబ్, ఫార్మసీలు
- డిమాండ్‌ను 'క్యాష్' చేసుకుంటోన్న ఆర్‌ఎంపీలు
- వైద్యం వికటించి.. ఇబ్బందులు పడుతోన్న రోగులు

సాక్షి, పుట్టపర్తి: ప్రథమ చికిత్స చేయాల్సిన ఆర్‌ఎంపీలు పరిధి దాటుతున్నారు. తెలిసీ తెలియని వైద్యం చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అడిగే వారు లేక.. తనిఖీలు చేసే వారు రాక.. జిల్లా వ్యాప్తంగా ఆర్‌ఎంపీల సారథ్యంలోని క్లినిక్‌లు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. గత్యంతరం లేక.. స్థానికంగా ఉందనే ఉద్దేశంతో రోగులు ఈ క్లినిక్‌లను ఆశ్రయిస్తున్నారు. అయితే అక్కడే ల్యాబ్ ఉంటుంది. ఫార్మసీ ఉంటుంది. సెలైన్ బాటిల్ ఎక్కిస్తారు. అన్ని విధులనూ ఆర్‌ఎంపీలే చూస్తున్నారు. చిన్న చిన్న రోగాలకు అక్కడే నయం అవుతోంది. కానీ తెలిసీ తెలియని వైద్యం కొందరికి వికటిస్తోంది. ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నాయి. వైద్యం వికటించి.. చిన్నారులు, బాలింతలు ఇబ్బందులకు గురై మరో ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందిన దాఖలాలు ప్రతి ఆర్‌ఎంపీల పరిధిలో వెలుగు చూశాయి. రోగుల డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని చక్కగా 'క్యాష్' చేసుకుంటున్నారు.

ఆర్‌ఎంపీలు.. ఆల్‌రౌండర్ విధులు

గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు క్లినిక్‌లలోనే ల్యాబ్, సెలైన్ బాటిల్ ఎక్కించడం, మందులు రాసి ఇవ్వడం, ఇంజక్షన్ చేయడం, మందుల పంపిణీ.. ఇలా అన్నీ ఆర్‌ఎంపీలే చేస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆల్‌రౌండర్ పాత్రను ఆర్‌ఎంపీలు పోషిస్తున్నారు. వారు ఇచ్చినదే మందు.. చేసినదే వైద్యం అన్న చందంగా మారింది. వైద్యాధికారుల పర్యవేక్షణ లేదు. ఇంకేముంది.. ఎక్కడో ఒక చోట ప్రాక్టీస్ చేయడం.. సొంతంగా క్లినిక్ నిర్వహించడం చాలామంది ఆనవాయితీగా మార్చుకున్నారు. అంతేకాకుండా రోగుల డిమాండ్‌ను క్యాష్ చేసుకుంటున్నారు. సమీప పట్టణాల్లోని కార్పొరేట్ ఆస్పత్రులతో కుమ్మక్కై ఇక్కడి నుంచి రోగులను మెరుగైన వైద్యం కోసం పంపిస్తారు. ఫీజులో కొంత పర్సంటేజీ కమీషన్ రూపంలో తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అర్హత లేకున్నా వైద్యం

ఆర్‌ఎంపీతో పాటు చాలా చోట్ల ప్రైవేటు క్లినిక్‌లను ప్రభుత్వ వైద్యులు నిర్వహిస్తున్నారు. ఎలాంటి స్పెషలైజేషన్ లేకున్నా.. డిగ్రీ ఆధారిత సర్టిఫికెట్‌తోనే అన్ని రకాల రోగాలకు వైద్యం చేస్తున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో చాలామంది చిన్నారులు ఆస్పత్రుల బాట పట్టారు. చిన్న పిల్లల డాక్టర్లు కానప్పటికీ కొందరు వైద్యం చేస్తున్నారు. అయితే కొందరికి నయమవుతోంది. మరికొందరు వేరే ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ఇంకొందరు రోగులు వైద్యం వికటించి ప్రమాదకర స్థితిలోకి వెళ్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సకాలంలో వైద్యం అందడం లేదనే కారణంతో గత్యంతరం లేక ప్రైవేటు క్లినిక్‌లు ఆశ్రయించినట్లు బాధితులు చెబుతున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే

ఆర్‌ఎంపీలు నిబంధనలు పాటించాల్సిందే. తనిఖీలు ముమ్మరం చేస్తాం. నిబంధనలు పాటించని క్లినిక్‌లను సీజ్ చేస్తాం. అంతేకాకుండా ఆయా క్లినిక్‌ల నిర్వాహకులపై కేసు నమోదుకు సిఫారసు చేస్తాం. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు ఉన్నారు. రోగులందరూ ప్రభుత్వాస్పత్రులనే ఆశ్రయించవచ్చు. ఆర్‌ఎంపీలు నిబంధనల మేరకు మాత్రమే వైద్యం చేయాలి. అన్నీ తామై వ్యవహరిస్తున్నట్లు తెలిస్తే.. తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– బాబా ఫక్రుద్దీన్, డెమో, డీఎంఅండ్‌హెచ్ కార్యాలయం

జిల్లా గణాంకాలు

ప్రైవేటు ల్యాబ్‌లు	68
స్కానింగ్ కేంద్రాలు	66
ప్రైవేటు ఆస్పత్రులు	165
అనుమతులు లేని క్లినిక్‌లు	1,000 పైనే
ఆర్‌ఎంపీలు	1,300 మంది పైనే..

లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం తగదు

- ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు టీడీపీ రాజకీయం
- టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు అశ్వత్థనాయక్



మాట్లాడుతున్న అశ్వత్థనాయక్

అనంతపురం కార్పొరేషన్: రాజకీయ లబ్ధి కోసమే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై టీడీపీ దుష్ప్రచారం చేస్తోందని టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు అశ్వత్థనాయక్ అన్నారు. అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు, టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణను ఆయన ఖండించారు. ధార్మిక విశ్వాసాలను దెబ్బతీసేలా మాట్లాడడం సరికాదన్నారు. నిర్దేశించిన ప్రమాణాలు లేకుంటే నెయ్యి ట్యాంకర్‌ను గోదాములోకి కూడా అనుమతించరనే విషయాన్ని తెలుసుకుని మాట్లాడాలన్నారు. వంద రోజుల పాలనలో కూటమి సర్కార్ పూర్తిగా విఫలమైందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని ఇప్పటి వరకూ అమలు చేయలేదని, ఈ అంశంపై దృష్టి సారించకుండా ప్రజలను ఏమార్చేందుకు ఇంతటి నీచానికి చంద్రబాబు అండ్ కో దిగజారారని మండిపడ్డారు. త్వరలో నిజనిజాలు తప్పక వెలుగు చూస్తాయన్నారు.

12 గంటల్లో 17 ఎకరాల్లో గుంటక పాసిన రైతు

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ గ్రామానికి చెందిన రైతు కె.హనుమంతు అరుదైన రికార్డు సృష్టించాడు. కేవలం 12 గంటల్లో 17.20 ఎకరాల్లో బాడుగ గుంటకతో పొలాన్ని బాసి అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. వివరాలు... గోవిందవాడకు చెందిన గురురాజుకు చెందిన 10 ఎకరాలు, దివాకర్ చెందిన 7.20 ఎకరాల్లోని మిరప పంటలో ఆదివారం వేకువ జామున 4 గంటలకు ఎద్దులతో గుంటక మొదలు పెట్టిన హనుమంతు... సాయంత్రం 4 గంటలకు పూర్తి చేశాడు. దీంతో గ్రామస్తులు ఎద్దులతో పాటు హనుమంతును అభినందించి సన్మానించారు. సాధారణంగా 17.20 ఎకరాల్లో గుంటక బాసాలంటే మూడు, నాలుగు రోజులు సమయం పడుతుందని గ్రామస్తులు తెలిపారు.

పరవశభరితం సాయికృష్ణ లీలామృతం



ఆకట్టుకున్న నృత్యరూపకంలోని ఘట్టాలు



ప్రశాంతి నిలయం: సత్యసాయి అవతార వైభవాన్ని చాటుతూ సాగిన 'సాయికృష్ణ లీలామృతం' నృత్యరూపకం భక్తులను పరవశింపజేసింది. పర్తియాత్రలో భాగంగా శ్రీకాకుళం జిల్లా సత్యసాయి భక్తులు ఆదివారం సాయంత్రం పుట్టపర్తి ప్రశాంతి నిలయం విచ్చేశారు. సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా బాలవికాస్ విద్యార్థులు, సత్యసాయి యూత్ సత్యసాయి అవతార వైభావాన్ని, భక్తుల చెంత ఆయన ప్రదర్శించిన లీలలను వివరిస్తూ 'సాయికృష్ణ లీలామృతం' నృత్యరూపకం నిర్వహించారు. కలియుగంలో జన్మించిన సత్యసాయి, శ్రీకృష్ణ భగవానుడు ఇద్దరూ ఒక్కటేనన్న సందేశాన్నిచ్చారు. చక్కటి నృత్య భంగిమలతో వారు నిర్వహించిన నృత్యరూపకం భక్తులను మైమరపించింది. పిదప భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



సాయికృష్ణ లీలామృతంలోని ఒక ఘట్టం →

వచ్చే సీజన్‌కల్లా చెర్లోపల్లి రిజర్వాయర్‌కు పూర్తిస్థాయి నీరు



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

కదిరి అర్బన్: చెర్లోపల్లి జలాశయాన్ని ఆదివారం రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. తొలుత ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌తో కలిసి పట్నం వద్ద హంద్రీ- నీవా మెయిన్ కాలువను పరిశీలించి.. పనులపై ఆరా తీశారు. 35 శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మెయిన్ కాలువ నిర్మాణం పూర్తి చేయడానికి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరానని ఎమ్మెల్యే కందికుంట మంత్రికి చెప్పారు. అనంతరం చెర్లోపల్లి జలాశయాన్ని సందర్శించారు. డ్యాం నీటి సామర్థ్యాన్ని హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే సీజన్‌కు పూర్తిస్థాయిలో డ్యాంలో నీరు ఉండేలా చూస్తామన్నారు. మంత్రి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. మంత్రి వెంట ఆర్డీఓ సన్నీవంశీ క్రిష్ణ, హెచ్ఎన్ఎస్ఎస్ సీఈ నాగరాజు, ఎస్ఈ దేశానాయక్, ఈఈ మురళి, డీఈ విశ్వనాథం, డీఎస్పీ శివనారాయణస్వామి, తహసీల్దార్ మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

మరమగ్గాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి

పుట్టపర్తి టౌన్: రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత ఆదేశాల మేరకు జిల్లాలో మరమగ్గాల పర్యవేక్షణ అధికారిగా అసిస్టెంట్ డైరెక్టర్ ఐజయ్యను నియమించారు. ఈ మేరకు చేనేత, జౌళిశాఖ జిల్లా అధికారి రమేష్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక అధికారి ధర్మవరం కేంద్రంగా మరమగ్గాలు తనిఖీ చేయనున్నారు. పవర్‌లూమ్ సమపస్యలు, పవర్ లూమ్స్ రిజర్వేషన్ యాక్ట్ ఉల్లంఘన గురించి ప్రత్యేక అధికారిని నేరుగా లేదా 73960 34586 నంబర్‌లో సంప్రదించవచ్చు.

తల్లడిల్లిన గుండెలు

- విషాదం నింపిన రోడ్డు ప్రమాదం
- కుమారుల మృతితో గుండెలవిసేలా రోదించిన తల్లిదండ్రులు
- అందరివీ రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలే
- కన్నీటి సంద్రమైన స్టాలిన్‌నగర్



ప్రమాదంలో ధ్వంసమైన ఇన్నోవా కారు



దెబ్బతిన్న లారీ ముందు భాగం



రోదిస్తున్న మృతుల కుటుంబీకులు

అనంతపురం: ఆ నలుగురూ ప్రాణ స్నేహితులు. అందరికీ పట్టుమని పాతికేళ్లు కూడా నిండలేదు. తమ కళ్ల ముందు కలసిమెలసి ఉండే పిల్లలను చూసి ఆ తల్లిదండ్రులు నిత్యం ఎంతో ఆనంద పడేవారు. అలాంటి వారిలో ఒక్కసారిగా విషాదం నిండింది. ఊహించని రోడ్డు ప్రమాదంలో వారి 'ఆశల దీపాలు' ఆరిపోవడంతో తల్లడిల్లిపోయారు. బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట సమీపంలో ఆదివారం తెల్లవారుజామున లారీని ఇన్నోవా కారు ఢీకొన్న ప్రమాదంలో అనంతపురంలోని స్టాలిన్ నగర్‌కు చెందిన చాకలి పవన్ (22), బలిజ పవన్‌కుమార్ (24), దాసరి శ్రీనివాసులు (24), ముస్తాక్ (23) దుర్మరణం పాలయ్యారు. ఒకేసారి కాలనీకి చెందిన నలుగురి మృతితో స్టాలిన్ నగర్ మూగబోయింది. చేతికందివచ్చిన పిల్లలు దూరమవడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతుల కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో సర్వజనాస్పత్రి దద్దరిల్లింది.

పెళ్లి సంబంధాలు చూస్తుండగా..

ప్రమాదంలో మృతి చెందిన చాకలి పవన్ వడ్రంగి పని చేసేవాడు. ఈ యువకుడి తల్లిదండ్రులు లక్ష్మీ, నారాయణలది ముదిగుబ్బ మండలం గజ్జిగారి పల్లి కాగా, ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చారు. పవన్ దిన కూలీగా, కొన్ని సార్లు చిన్నచిన్న కాంట్రాక్టులు తీసుకుని ఇళ్లల్లో షోకేజ్‌లు, సెల్ఫ్‌లు చేసేవాడు. అలా కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. తమ కుమారుడికి పెళ్లి చేయాలని ఇటీవల తల్లిదండ్రులు సంబంధాలు చూస్తున్నారు. ఈ క్రమంలోనే అతడు మృతి చెందడంతో వారు గుండెలవిసేలా రోదించారు. ఎంత పనిచేశావు దేవుడా అంటూ లక్ష్మీ, నారాయణ రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

సంతోషం.. అంతలోనే విషాదం..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బలిజ పవన్ కుమార్ ఇటీవలే ఎంబీఏ పూర్తి చేశాడు. ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ జాబ్ వచ్చింది. వర్క్‌ఫ్రం హోం విధానంలో ఇంట్లో నుంచే పని చేస్తున్నాడు. ఉద్యోగంలో చేరి ఒక నెల అయింది. ఇంకా జీతం కూడా తీసుకోలేదు. ఒక్కగానొక్క కుమారుడికి మంచి ఉద్యోగం రావడంతో తల్లిదండ్రులు బేల్దారి ప్రసాద్, వెంకటలక్ష్మమ్మ ఎంతో సంతోష పడ్డారు. ఇక తమకు ఎలాంటి ఇబ్బందీ లేదు అనుకుంటూ ఉన్న తరుణంలోనే విషాదం చోటు చేసుకోవడంతో వారు తట్టుకోలేకపోతున్నారు. పవన్‌కు శ్రీలక్ష్మి అనే చెల్లెలు ఉంది.

చేదోడుగా ఉంటాడనుకుంటే..

దాసరి వెంకటేశులు, శారద దంపతుల కుమారుడు దాసరి శ్రీనివాసులు కారు డ్రైవర్. వెంకటేశులుకు ఇద్దరు కుమారులు కాగా, చిన్నవాడు శ్రీనివాసులు. రొద్దం మండలం తురకలాపట్నానికి చెందిన వీరు 20 సంవత్సరాల క్రితం స్టాలిన్‌నగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. వెంకటేశులు ఎంజీ షోరూంలో లారీ కంట్టైనర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండే శ్రీనివాసులు మరణించాడన్న వార్త తెలుసుకున్న తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగారు.

మా దగ్గర ఉన్నా బతికేవాడివి కద నాన్నా..

గుంతకల్లుకు చెందిన మాబు, మున్నీ దంపతుల రెండో కుమారుడు ముస్తాక్ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. చాలా కాలం స్టాలిన్‌నగర్‌లో నివాసం ఉన్న ఈ యువకుడి కుటుంబం 6 నెలల క్రితం తిరిగి గుంతకల్లుకు వెళ్లిపోయింది. ముస్తాక్ మాత్రం ఇక్కడే ఉంటూ చాకలి పవన్‌తో కలిసి వడ్రంగి పనికి వెళ్లేవాడు. చేతికి అంది వచ్చిన కుమారుడు దూరం కావడంతో మాబు, మున్నీ తల్లడిల్లిపోతున్నారు. గుంతకల్లులో తమతో పాటు ఉన్నా ఇలా జరిగేది కాదు కదా నాన్నా అంటూ గుండెలవిసేలా రోదించారు.

క్లుప్తంగా

108 వాహనం ఢీ - వృద్ధుడి మృతి

లేపాక్షి: అంబులెన్స్ ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... లేపాక్షి మండలం గొంగటిపల్లికి చెందిన అశ్వత్థప్ప (75) ఆదివారం తెల్లవారుజాము 5.30 గంటలకు గ్రామ శివారులోని రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతున్న సమయంలో చిలమత్తూరు నుంచి హిందూపురం వైపుగా వెళుతున్న 108 అంబులెన్స్ వెనుక నుంచి ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అశ్వత్థప్పను అదే వాహనంలో హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఏడీపీఎస్ఏ నూతన కార్యవర్గం ఎన్నిక




అనిల్‌కుమార్‌రెడ్డి సాయిగీత

పుట్టపర్తి: జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం (ఏడీపీఎస్ఏ) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం అనంతపురంలోని సంగమేష్‌నగర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఉమ్మడి జిల్లా ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్ల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ వెంకటరామిరెడ్డి, గోపాలరెడ్డి తదితరులు హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా అనిల్‌కుమార్‌రెడ్డి (కదిరి), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కృష్ణమూర్తి (పుట్టపర్తి), ఉపాధ్యక్షుడిగా కదిరి మహబూబ్‌బాషా, నాయుడు, హిందూపురం జవహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సాయిగీత (పుట్టపర్తి), కోశాధికారిగా జయచంద్ర నాయుడు, సీఆర్వోగా రవిచంద్రారెడ్డి, సభ్యుడిగా కొత్తచెరువు వేణుగోపాల్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి



మృతుడు వెంకటరమణప్ప

హిందూపురం అర్బన్: మండలంలోని చౌళూరు గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అతిగా మద్యం సేవించి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతుడిని కర్ణాటకలోని పరగోడు గ్రామానికి చెందిన వెంకటరమణప్ప (66)గా గుర్తించారు. భార్య పదేళ్ల క్రితమే మృతిచెందిందని, ఐదేళ్లుగా తాగుడుకు బానిసై గ్రామాల్లో తిరుగుతూ కాలం వెళ్లదీసేవాడని పోలీసులు తెలిపారు. పలుమార్లు కుటుంబసభ్యులు ఇంటికి తీసుకెళ్లినా తిరిగి రోడ్డున పడుతుండడంతో వారూ కూడా పట్టించుకోవడం మానేశారన్నారు. కాగా, చౌళూరులో తన తండ్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న కుమారుడు గంగరాజు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని నిర్ధారించాడు. ఘటనపై హిందూపురం అప్‌గ్రేడ్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'ఏ'వన్‌గా నిలిచారు

- దులీప్‌ట్రోఫీ విజేత ఇండియా-ఏ
- రెండో స్థానంలో నిలిచిన ఇండియా-సీ
- ముగిసిన దులీప్ ట్రోఫీ



విజేత ట్రోఫీతో ఇండియా-ఏ జట్టు క్రీడాకారులు

అనంతపురం: దులీప్ ట్రోఫీని ఇండియా-ఏ జట్టు కైవసం చేసుకుంది. టోర్నీలో 12 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత 9 పాయింట్లతో ఇండియా- సీ జట్టు రెండో స్థానంలో నిలిచింది. అనంత క్రీడాగ్రామం వేదికగా బీసీసీఐ ఆధ్వర్యంలో చివరి రౌండ్ పోటీలు ఆదివారం ముగిశాయి. 132 పరుగులతో ఇండియా-సీ జట్టుపై ఇండియా-ఏ జట్టు, 257 పరుగుల తేడాతో ఇండియా-బీ జట్టుపై ఇండియా-డీ జట్టు విజయం సాధించాయి. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డును ఇండియా-ఏ జట్టు బ్యాటర్ రావత్, ఇండియా -డీ బ్యాటర్ రిక్కీభుయి దక్కించుకున్నారు. అలాగే సూపర్‌స్ట్రైకర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును సైతం రిక్కీభుయి కైవసం చేసుకున్నాడు.ఇండియా- సీ జట్టు బౌలర్ అన్షుల్ కాంబోజ్‌కు ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్ అవార్డు దక్కింది. ఇండియా-ఏ జట్టుకు విజేత కప్పును ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు, ఇండియా- సీ జట్టుకు రన్నర్స్ కప్‌ను మంత్రి పయ్యావుల కేశవ్ అందజేశారు. స్ట్రైకర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులను మంత్రి పయ్యావుల కేశవ్, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌కు సంబంధించి ఏ గ్రౌండ్‌లో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, బీ గ్రౌండ్‌లో ఏసీఏ అతిథి ఆర్‌వీఎస్‌కే రంగారావు ప్రదానం చేశారు. ఈ నెల 5 నుంచి 22వ తేదీ వరకు జరిగిన దులీప్ ట్రోఫీ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ మాంఛో ఫెర్రర్ అభినందనలు తెలిపారు.

ఇండియా-డీ భారీ విజయం..

ఇండియా -బీతో జరిగిన మ్యాచ్‌లో ఇండియా-డీ జట్టు భారీ విజయాన్ని నమోదు చేసింది. 244/5 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో చివరి రోజు ఆటను కొనసాగించిన ఇండియా-డీ జట్టు 305 పరుగులకు ఆలౌట్ అయింది. రికీ భుయి అజేయ శతకం సాధించాడు. టోర్నీలో ఇది ఆయన రెండో సెంచరీ కావడం గమనార్హం. 124 బంతుల్లో 119 పరుగులు (15 ఫోర్లు, 3 సిక్సరు) అజేయంగా నిలిచాడు. మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని కలుపుకుని 373 పరులు లక్ష్యాన్ని ఇండియా-బీ జట్టు ముందు ఇండియా-డీ జట్టు ఉంచింది. అర్షదీప్, థాక్రే ధాటికి ఇండియా-బీ జట్టు 115 పరుగులకే ఆలౌట్ అయింది. అర్షదీప్ ఆరు వికెట్లు, ఆదిత్య థాక్రే నాలుగు వికెట్లు పడగొట్టారు. దీంతో ఇండియా-డీ జట్టు 257 పరుగుల భారీ తేడాతో బీ జట్టుపై గెలుపొందింది.

సాయి సుదర్శన్ సెంచరీ వృథా..

270/6 పరుగుల ఓవర్‌నైట్ స్కోరు తో చివరి రోజు ఆటను కొనసాగించిన ఇండియా- ఏ జట్టు మరో 16 పరుగులు జోడించి డిక్లేర్డ్ చేసింది. భారీ పరుగుల ఛేదనలో 'ఏ' జట్టు బౌలర్ల ధాటికి ఇండియా-సీ జట్టు బ్యాటర్లు నిలువలేకపోయారు. 81.5 ఓవర్ల వద్ద 217 పరుగులకు ఆలౌట్ అయ్యారు. 206 బంతుల్లో 111 (12 ఫోర్లు) పరుగులు సాధించిన సాయి సుదర్శన్ ఒంటరి పోరాటం వృథా అయింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 44, వైశాఖ్ 17, ఇషాన్ కిషన్ 17 మినహా మిగిలిన వారు రెండంకెల స్కోరును కూడా దాటలేకపోయారు. ఇండియా-ఏ జట్టు బౌలర్లలో ప్రసిద్ధ్‌కృష్ణ 3, తనుష్ కోటియన్ 3, అకీబ్‌ఖాన్ 2, ములాని ఓ వికెట్ తీసుకున్నారు. దీంతో ఇండియా-ఏ జట్టు 132 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముగింపు కార్యక్రమంలో ఏసీఏ కౌన్సిలర్ డి. గౌర్ విష్ణు, గేమ్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఎంఎస్ కుమార్, కలెక్టర్ వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ తదితరులు పాల్గొన్నారు.



రుతురాజ్ గైక్వాడ్‌కు రన్నర్స్ కప్ అందజేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్



అన్షుల్ కాంభోజ్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును అందజేస్తున్న మాంఛో ఫెర్రర్

లక్ష్మీచెన్నకేశవపురంలో చోరీ

ధర్మవరం అర్బన్: స్థానిక లక్ష్మీచెన్నకేశవపురంలో శనివారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. లక్ష్మీచెన్నకేశవపురంలో నివాసముంటున్న బాబు తన కుటుంబ సభ్యులతో కలసి శనివారం ఇంటికి తాళం వేసి పులివెందుల సమీపంలోని భైరవస్వామి ఆలయానికి వెళ్లాడు. ఈ విషయాన్ని గమనించిన దుండగులు అర్ధరాత్రి తర్వాత తాళం బద్ధులుగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న రూ.3.50లక్షల నగదు, నాలుగున్నర తులాల బంగారు నగలతో పాటు బాత్‌రూంపైన అమర్చిన ఇన్వర్టర్‌ను అపహరించారు. ఆదివారం ఉదయం గమనించిన చుట్టుపక్కల వారి నంచి సమాచారం అందుకున్న బాబు వెంటనే ఇంటికి చేరుకున్నాడు. టూటౌన్ సీఐ రెడ్డప్ప, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలను సేకరించారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో పడి ఉన్న షరీఫ్ మృతదేహం

గార్లదిన్నె: విద్యుత్ షాక్‌కు గురై ఓ కౌలు రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన షరీఫ్ (30)... అదే గ్రామ సమీపంలో రెండు ఎకరాల పొలాన్ని కౌలకు తీసుకుని వేరుశనగ పంట సాగు చేశాడు. ఆదివారం మధ్యాహ్నం పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన ఆయన... మోటర్ ఆన్ కాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకెళ్లి పరిశీలిస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సాయంత్రమైనా షరీఫ్ ఇంటికి చేరుకోకపోవడంతో పొలం యజమాని అక్కడకెళ్లి పరిశీలించాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విగతజీవిగా పడి ఉన్న షరీఫ్‌ను గురితంచి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

5 నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నిర్మాణ సభలు

- ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర నిర్మాణ సభలు అక్టోబరు 5 నుంచి 8వ తేదీ వరకూ అనంతపురంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ ఆదివారం అనంతపురంలోని సీపీఎం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్, జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ... సభలకు ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ ఆలిండియా అధ్యక్షుడు పి. సాను పాల్గొంటారని, పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, విద్యావేత్తలతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 450 మంది నాయకులు హాజరవుతారన్నారు. కూటమి సర్కార్ అధికారంలో వచ్చి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా రోజురోజుకూ పుట్టగొడుగుల్లా విద్యా రంగ సమస్యలు పుట్టుకొస్తున్నాయన్నారు. మెడికల్ కళాశాలలు నిర్వహించలేమంటూ 700 ఎంబీబీఎస్ సీట్ల రద్దుకు చంద్రబాబు ప్రభుత్వం రాసిన లేఖను తప్పుబట్టారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణను ఈ సభల్లో రూపొందించి, ఆ దిశగా పోరుబాట పడతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా బాలికల విభాగం కన్వీనర్ రజిత, జిల్లా అధ్యక్షుడు సిద్దు, ఉపాధ్యక్షులు రమేష్, శివ, సహాయ కార్యదర్శులు సూర్యప్రకాష్, భీమేష్, వంశీ, నగర నాయకులు సోము, గణేష్, మోహన్ పాల్గొన్నారు.

ప్రతి టీచరూ అనధికార శాసనకర్తే

- ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రతి ఉపాధ్యాయుడూ అనధికార శాసనకర్తేనని ఎస్కేయూ తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ జి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) జిల్లా విద్యా వైజ్ఞానిక మహాసభలు ఆదివారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో జరిగాయి. ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. 'ఉపాధ్యాయ అస్తిత్వం - నాడు.. నేడు' అంశంపై ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యం ప్రసంగించారు. తరగతి గది అనేది ఏ దేశానికైనా ఎనలేని పెట్టుబడి అన్నారు. ప్రభుత్వ బడులన్నీ ప్రజలవని, వాటిని కాపాడడంలో ముందుండాలని ఉపాధ్యాయ సంఘాలకు పిలుపునిచ్చారు. మరో అతిథి డాక్టర్ రవిశ్రీనివాస్ 'పిల్లల్లో విపరీత ధోరణులు' అంశంపై మాట్లాడారు. టీవీలు, మొబైల్ ఫోన్లు బాల్యాన్ని విపరీత ధోరణులు వైపు నడిపిస్తున్నాయన్నారు. వీటి బారి నుంచి పిల్లలను కాపాడడంతో తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... ఉపాధ్యాయ ఉద్యమాన్ని పెడధోరణి పట్టించే రాజకీయ పార్టీల మాయలో చిక్కుకోరాదని, సమాజ శ్రేయస్సే లక్ష్యంగా విద్యార్థులను తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటసుబ్బయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు పి. వరప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాసనాయక్, ఐఫియా కమిటీ సభ్యుడు సత్యప్రసాద్, జిల్లా ప్రత్యేక ఆహ్వానితులు వెంకటరెడ్డి, జిల్లా పూర్వ అధ్యక్షుడు రవీంద్ర, అసోసియేట్ అధ్యక్షుడు పోతులయ్య, అదనపు కార్యదర్శి ఆంజనేయులు నాయక్, క్రమశిక్షణ కమిటీ సభ్యుడు అశోక్ నాయక్ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్‌లో భారీగా బదిలీలు

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. సొంత జిల్లాల్లో పాతికేళ్లకు పైబడి పని చేసిన వారందరికీ జిల్లా సరిహద్దులు దాటించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఆదివారం రాత్రి జిల్లాలకు అందాయి. జెడ్పీ సీఈఓగా నంద్యాల జిల్లా డ్వామా పీడీగా పనిచేస్తున్న రామచంద్రారెడ్డిని నియమించారు. అయితే ఆయన రెండున్నర నెలల పాటు ఆయన సెలవు పెట్టి సొంత పనిపై ఆదివారం రాత్రే అమెరికాకు బయలదేరినట్లు సమాచారం. ఇప్పటి వరకూ జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓగా పనిచేస్తున్న ఓబుళమ్మను కడప జెడ్పీ సీఈఓగా నియమించారు. కడప డీఎల్‌డీఓ జి.వెంకటసుబ్బయ్యను అనంతపురం జెడ్పీ డిప్యూటీ సీఈఓగా, ఇక్కడి డిప్యూటీ సీఈఓ కె. లలితాబాయిని అనంతపురం రెగ్యులర్ డీఎల్‌డీఓగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సైనిక సంక్షేమ శాఖ అధికారిగా పని చేస్తూ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన శ్రీనివాసులును వైఎస్సార్ జిల్లా బద్వేలు డీఎల్‌డీఓగా నియమించారు. కదిరి డీఎల్‌డీఓగా పని చేస్తున్న సి.సూర్యనారాయణను నంద్యాల జిల్లా ఆత్మకూరుకు బదిలీ చేశారు. అనంతపురం డ్వామా ఇన్‌చార్జ్ పీడీ పి.విజయలక్ష్మిని గుంతకల్లు డీఎల్‌డీఓగా నియమించారు. అనంతపురం డీఆర్‌డీఏ పీడీగా పని చేసి సెలవుపై వెళ్లిన నరసింహారెడ్డిని నంద్యాల జిల్లా డోన్ డీఎల్‌డీఓగా నియమించారు. కడప జెడ్పీ డిప్యూటీ సీఈఓగా పని చేస్తున్న ఎం.సుధాకర్‌రెడ్డి శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి డీఎల్‌డీఓగా నియమితులయ్యారు. కడప ఏపీడీగా తాడిపత్రి ఏపీడీ టి.వెంకటరత్నం, కళ్యాణదుర్గం డీఎల్‌డీఓ వి.శంకర్‌ను గుంటూరు జిల్లా డ్వామా పీడీగా బదిలీ చేశారు. అనంతపురం డ్వామా పీడీగా కర్నూలు డ్వామా పీడీ ఎస్.సలీం బాషా నియమించారు.

పంచాయతీరాజ్ ఎస్ఈగా జహీర్ అస్లాం

పంచాయతీరాజ్ అనంతపురం జిల్లా ఎస్ఈగా అహమ్మద్ జహీర్ అస్లాం నియమితులయ్యారు. ఇప్పటి వరకూ ఈ స్థానంలో ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన కేవీకేవీ ప్రసాద్ పీఐయూ ఈఈగా కొనసాగుతారు. మరో నెల రోజుల్లో ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు. పంచాయతీరాజ్ అనుబంధ అనంతపురం పీఆర్ఐ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)గా పని చేస్తున్న బి.చంద్రశేఖర్‌ను పార్వతీపురం పీఆర్ఐ ఈఈగా బదిలీ చేశారు.

అనుమతి లేకుండా స్టిక్కర్ ఎలా వేస్తారు?

- టీడీపీ నాయకులను నిలదీసిన ఇంటి యజమాని
- దాడికి ప్రయత్నించిన 'తమ్ముళ్లు'



టీడీపీ నాయకులను నిలదీస్తున్న ఇంటి యజమాని

యాడికి: అనుమతి లేకుండా తమ ఇంటికి టీడీపీ స్టిక్కర్ ఎలా వేస్తారంటూ యాడికి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఆ పార్టీ నాయకులను నిలదీశారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు అతనిపై దాడికి యత్నించారు. బాధితుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని వైశ్యా వీధిలో ఆదివారం సాయంత్రం టీడీపీకి చెందిన మాజీ ఎంపీపీ రంగయ్య, ఆ పార్టీ నాయకులు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజల అనుమతి లేకుండానే వారి ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయ సమీపంలోని ఓ ఇంటి గోడపై స్టిక్కర్ అతికించగా..యజమాని అభ్యంతరం తెలిపాడు. తమ అనుమతి లేకుండా ఎలా అతికిస్తారంటూ నిలదీశాడు. దీంతో టీడీపీ నాయకులు అతనిపై దాడికి ప్రయత్నించారు. అయినప్పటికీ వెనక్కి తగ్గలేదు. తాను ఏ పార్టీకీ సంబంధించిన వ్యక్తిని కాదని, తనకు అందరూ కావాలని, స్టిక్కర్ తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు. దీంతో తోకముడిచిన 'తమ్ముళ్లు' స్టిక్కర్ తొలగించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఎన్‌సీసీ శిక్షణతో బంగారు భవిత



క్యాడెట్లను ఉద్దేశించి మాట్లాడుతున్న డీసీసీ కల్నల్ ఎంఎస్ కులకర్ణి

కూడేరు: ఎన్‌సీసీ శిక్షణ పొందడం ద్వారా బంగారు భవిష్యత్తు ఉంటుందని క్యాడెట్లకు ఎన్‌సీసీ నగర్ క్యాంప్ కమాండర్ కల్నల్ ఎల్‌డీ రోడ్రిక్స్, డిప్యూటీ క్యాంప్ కమాండర్ (డీసీసీ) కల్నల్ ఎంఎస్ కులకర్ణి సూచించారు. కూడేరు మండలం బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో 6వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో సీఏటీసీ-7 ఎన్‌సీసీ శిక్షణా తరగతులు ఆదివారం ప్రారంభయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో క్యాడెట్లను ద్దేశించి వారు మాట్లాడారు. ఇక్కడి శిక్షకులు నేర్పే ప్రతి అంశమూ జీవితంలో ఎదగడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్లతో ఉన్నత విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సదుపాయాన్ని పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో క్యాంప్ అడ్జుటెంట్ సుమితా హరికృష్ణ, ఎల్‌టీ రంగనాథ్, అధికారులు సంగీతశశికళ, ప్రగతికుమార్, తేజశ్వని, వివిధ జిల్లాలకు చెందిన 500 మంది క్యాడెట్లు పాల్గొన్నారు.


బాలికపై అత్యాచారయత్నం

పెనుకొండ: స్థానిక కుమ్మరదొడ్డిలో ఓ బాలికపై అత్యాచారయత్నం జరిగిందని, దీనిపై కేసు నమోదు చేయాలని ఆ ప్రాంత ముస్లిం మహిళలు డిమాండ్ చేశారు. బాధిత బాలికను పెళ్లి చేసుకోవాలని బాధ్యుడైన కర్నూలుకు చెందిన వ్యక్తిని ప్రాధేయపడినా ఆయన పట్టించుకోక పోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి రూరల్: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం పెద్దపొడమల గ్రామానికి చెందిన మల్లికార్జున కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకుని ఆదివారం ఉదయం పెద్దపొడమల సమీపంలోని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

నాటు సారా పట్టివేత



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కంబదూరు: అక్రమంగా నాటుసారాతో పాటు కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం ఉదయం కంబదూరు మండలం అండేపల్లిలో ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో గ్రామానికి చంఎదిన వీరాంజనేయులు వద్ద 116 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం, శివన్న వద్ద 10 లీటర్ల నాటుసారా పట్టుబడింది. మద్యంతో పాటు నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'ఐ కేర్' సేవలకు మంగళం

- 2018లో ఎన్నికలకు ముందు ప్రారంభించిన అప్పటి సీఎం చంద్రబాబు
- టీడీపీ పథకాన్ని ప్రజల కోసం కొనసాగించిన వైఎస్ జగన్
- కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా 115 కేంద్రాల మూత
- ఉపాధి కోల్పోయిన 200 మంది ఉద్యోగులు



పెనుకొండలో మూతపడిన కేంద్రం

సాక్షి, పుట్టపర్తి: చంద్రబాబు ఏ పథకం అమలు చేసినా.. ఎలాంటి హామీ ఇచ్చినా కేవలం ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకునేందుకేనని స్పష్టంగా అర్థం అవుతోంది. 2018లో 'ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రం' కార్యక్రమాన్ని అప్పటి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి.. కంటి అద్దాలు పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన కార్యక్రమమిది. మరో ఏడాదిలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఓట్ల కోసమే దీనిని అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే ఆ వెంటనే జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు ఘోరంగా ఓటమి పాలై వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది. పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి, కళ్లజోడు పంపిణీ చేసే పథకం కావడంతో ఈ పథకాన్ని రద్దు చేయకుండా యథాతథంగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగించారు. అయితే ఎంతో మంది పేదలకు కంటి చూపును అందించే ఈ పథకాన్ని కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రద్దు చేస్తున్నట్లుగా సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా 115 కేంద్రాల్లో పని చేసే సుమారు 200 మంది ఉపాధి కోల్పోయారు.

'విజన్ 2020'లో భాగంగా..

'విజన్ 2020'లో భాగంగా 2018 జనవరిలో అప్పటి సీఎం చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా 115 ఈ-ఐ కేంద్రాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లాలోని పెనుకొండ, ధర్మవరం, మడకశిర, చెన్నేకొత్తపల్లి, నల్లమాడలోనూ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాల్లో ఫండస్ మిషన్, ఆటో రెక్టార్, లెన్సోమీటర్, ట్రైల్ సెట్, విజన్ డ్రమ్, కంప్యూటర్లను ఏర్పాటు చేసి.. ఇద్దరు ఆప్తాల్మిక్ నిపుణులను నియమించారు. ఈ పథకం పేదలకు ఉపయోగపడుతుండటంతో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక కూడా కొనసాగించారు. ఆయా కేంద్రాల్లో అపోలో సంస్థ సేవలు అందించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది కంటి పరీక్షలను ఉచితంగా చేయించుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక.. ఈనెల 4వ తేదీ నుంచి కంటి అద్దాల ఆర్డర్‌ను ప్రభుత్వం తిరస్కరించింది. ఈ నెల 16 నుంచి ఆయా కేంద్రాలను కూడా మూసేయాలని ఆదేశించింది.

వందల మందికి ఉపాధి పోయె

రాష్ట్ర వ్యాప్తంగా 115 కేంద్రాల్లో జనాభా ఆధారంగా ఒక్కో కేంద్రంలో ఒకరు లేదా ఇద్దరు చొప్పున పని చేసేవారు. ప్రతి నెలా ఒక్కొక్కరికి రూ.18 వేల చొప్పున వేతనం ఇచ్చేవారు. ప్రస్తుతం ఈ కేంద్రాలు మూతపడటంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 200 మంది ఉపాధి కోల్పోయారు. అలాగే లక్షలాది మందికి ఉచిత కంటి పరీక్షలు దూరమయ్యాయి. ప్రతి కేంద్రంలో సగటున రోజుకు 40 మంది కంటి పరీక్షలు చేయించుకునేవారు. అందులో అవసరమైన వారికి కంటి అద్దాలను ఉచితంగా అందజేసేవారు. ఆపరేషన్ అవసరమైతే ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేసేవారు.

మారని చంద్రబాబు తీరు



ఎన్నికల కోసం ప్రతిసారీ చంద్రబాబు ఏదో ఒక పథకం తీసుకొస్తారు. ప్రజలను నమ్మించి అధికారం చేపట్టిన తర్వాత మోసం చేస్తారు. ఇప్పటికైనా చంద్రబాబు మారాలి. పేదలకు పనికొచ్చే పథకాలను కొనసాగించాలి. తన పథకం కాకపోయినా ప్రజలకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాటు విజయవంతంగా కొనసాగించారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి. అద్దాలను అందజేశారు. పైసా ఖర్చు లేకుండా ఎంతో మంది లబ్ధి పొందారు.

– పురుషోత్తం రాయల్, ధర్మవరం

పేదల కోసం కొనసాగించాలి



'ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రం' సేవలు పేదలకు ఎంతో ఉపయోగకరం. పెనుకొండ ఆస్పత్రిలోని కేంద్రంలో దాదాపు ఆరేళ్లకు పైగా ఉచిత సేవలందించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు పెనుకొండలోని ఐ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉండేది. రోజూ 50 మందికి పైగా కంటి పరీక్షల కోసం వచ్చేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుమారు లక్ష మందికి పైగా ఉచిత సేవలు పొందారు. లక్షల మంది పేదలకు ఉపయోగపడే పథకాన్ని పేదల కోసం కొనసాగించాలి.

– సుధాకర్‌నాయక్, పెనుకొండ

ఇబ్బందులు తప్పడం లేదు



మడకశిర ప్రభుత్వ ఆసుపత్రిలో గడిచిన ఏడేళ్లు కంటి పరీక్షలకు ఎలాంటి ఇబ్బంది లేకుండాపోయింది. పేద, మధ్య తరగతి వృద్ధులు, ప్రజలు ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకుని, ఇతరులపై ఆధారపడకుండా సొంత పనులు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పథకాన్ని రద్దు చేయడంతో కంటి పరీక్షలు చేయించుకునేందుకు చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. చంద్రబాబు తీరు మార్చుకుని ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలను పునరుద్ధరించాలి.

– సుబ్బరాయుడు, ఆర్.అనంతపురం, మడకశిర మండలం